ప్రజాశక్తి

శనివారం 29 జూలై 2023

5

శ్రీకాకుళం

వర్ష బాధితులకు ఉదార సాయం

శ్రీకాకుళం : రాష్ట్రంలో భారీ వర్షాలు, వరదల కారణంగా ఇబ్బందులకు గురవుతున్న ప్రజానీకానికి మానవతా దృక్పథంతో ఉదారంగా సాయం అందించాలని ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్మోహన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. భారీ వర్షాలు, వరదల వల్ల ఉత్పన్నమైన పరిస్థితులపై కలెక్టర్, ఎస్‌పితో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. పునరావాస కేంద్రాలకు తరలించిన వారికి మంచి ఆహారం, వసతులు కల్పించాలన్నారు. పూరి గుడిసెలు దెబ్బతిన్న కుటుంబాలకు పూర్తిస్థాయి సహాయంగా రూ.10 వేలు అందించాలని ఆదేశించారు. గర్భిణులు, వికలాంగులు, వృద్ధులు, చిన్నపిల్లలపై దృష్టిసారించాలన్నారు. వైద్యారోగ్యశాఖ పూర్తిస్థాయిలో మందులు అందుబాటులో ఉంచుకోవాలని చెప్పారు. కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్, ఎస్‌పి జి.ఆర్ రాధిక, డిఆర్‌ఒ మురళీకృష్ణ, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

జీడి రైతులపై ప్రభుత్వాల కక్ష

- రైతుల సమస్యలు రాష్ట్ర ప్రభుత్వానికి పట్టవా?
- స్థానిక మంత్రులు ఎందుకు మాట్లాడడం లేదు
- సత్యాగ్రహ దీక్షలో మాజీ ఎమ్మెల్సీ ఎం.వి.ఎస్ శర్మ
- కాశీబుగ్గలో సత్యాగ్రహం దీక్ష

సత్యాగ్రహ దీక్షను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్సీ ఎం.వి.ఎస్ శర్మ

ప్రజాశక్తి - పలాస

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం జీడి పంటపై కక్ష కట్టిందని, అందులో భాగంగానే జీడి రైతులను నాశనం చేయాలని చూస్తోందని మాజీ ఎమ్మెల్సీ ఎం.వి.ఎస్ శర్మ విమర్శించారు. జీడిపిక్కలకు మద్దతు ధర ప్రకటించాలని, రైతుభరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ కాశీబుగ్గ గాంధీ విగ్రహం వద్ద జీడిరైతు సంఘం ఆధ్వర్యాన 24 గంటల సత్యాగ్రహ దీక్షను శుక్రవారం ఆయన ప్రారంభించారు. అంబేద్కర్, గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. జీడిరైతు సంఘం పతాకాన్ని మార్పు ట్రస్టు అధ్యక్షులు మట్ట ఖగేశ్వరరావు, రైతు ఉద్యమ సీనియర్ నాయకులు కె.కృష్ణారావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శర్మ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జీడి పిక్కలపై ఉన్న ఎక్సైజ్ సుంకాన్ని ఐదు శాతం నుంచి 2.5 శాతానికి తగ్గించడంతో ఆఫ్రికా దేశాల నుంచి దిగుమతులు వెల్లువెత్తడంతో, ఇక్కడి రైతాంగానికి తీవ్ర నష్టం వాటిల్లుతోందన్నారు. విదేశీ పిక్కలను దిగుమతి చేయొద్దని చెప్పే ధైర్యం రాష్ట్రంలోని అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపికి ఉందా అని ప్రశ్నించారు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామన్న బిజెపి, రైతు ప్రభుత్వమని చెప్పుకుంటున్న వైసిపి ప్రభుత్వం జీడి మద్దతు ధరపై ఎందుకు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. జీడి పంటను పరిశ్రమలకు అనుసంధానం చేసి కొనుగోలు చేయడానికి ఉన్న ఇబ్బందేమిటన్నారు. జీడి రైతుల ఘోష స్థానిక మంత్రులు సీదిరి అప్పలరాజు, ధర్మాన ప్రసాదరావు, స్పీకర్ తమ్మినేని సీతారాంకు వినిపించడం లేదా అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి వద్దకు జీడి రైతులను తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి చొరవ చూపడం లేదన్నారు. సిఎంను కలిసేందుకు మంత్రులు, ఎమ్మెల్యేలకే అవకాశం లేదని, వీళ్లేం సమస్యలు పరిష్కరిస్తారని ఎద్దేవా చేశారు. జీడి రైతుల సమస్యలపై పోరాడే దమ్ము టిడిపి, జనసేనకు ఉందా?, ఉంటే ఎందుకు ఆ పనిచేయడం లేదని ప్రశ్నించారు. 80 కేజీల జీడిపిక్కల బస్తాకు రూ.16 వేల మద్దతు ధర ప్రకటించి, ఆర్‌బికెల ద్వారా వెంటనే కొనుగోళ్లు ప్రారంభించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేరళ ప్రభుత్వం నాలుగు జీడి కార్పొరేషన్లను ఏర్పాటు చేసి జీడి ఉత్పత్తి, దిగుబడులు పెంచే విధానాలను అమలు చేస్తూ జీడి రైతులు, పరిశ్రమల అభివృద్ధి, కార్మికులకు భరోసానిస్తూ ఆదర్శవంతంగా నిలిచిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా జీడి కార్పొరేషన్ లేదా బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యమాలతోనే సమస్యలు పరిష్కారమవుతాయని, జీడిరైతులు ఐక్యంగా పోరాడితే ప్రభుత్వాలు దిగి వస్తాయన్నారు.

రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.మోహనరావు మాట్లాడుతూ మద్దతు ధర కోసం నాలుగు నెలలుగా రైతులు ఆందోళనలు చేస్తున్నా, రైతు ప్రభుత్వమని చెప్పుకుంటున్న జగన్మోహన్‌రెడ్డి ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. జీడి రైతులు ఐక్యంగా ఉండి మద్దతు ధర కోసం ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాల్సిన అవసరముందన్నారు. జీడి రైతులు ఒంటరిగా లేరని, వారి పోరాటానికి జిల్లావ్యాప్తంగా ఉద్యోగ, కార్మిక, కర్షక, ప్రజాసంఘాలు మద్దతుగా ఉన్నాయని చెప్పారు. దీక్షకు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, కాష్యూ లేబర్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు కె.భీమారావు, బొమ్మాళి తాతయ్య, కాష్యూ లేబర్ అసోసియేషన్ కార్యదర్శి అంబటి ఆనందరావు, ఎస్ఎఫ్ఐ నాయకులు హరీష్, చందు, వంకులూరు ఎంపిటిసి సురేఖ, ఎస్.కాంతారావు, అండమాన్ ప్రజా పోరాట నాయకులు డి.లక్ష్మణరావుతో పాటు పలు సంఘాల నాయకులు సంఘీభావం తెలిపారు. ప్రజా కళాకారులు కె.హేమసూదనరావు, కె.బాలాజీరావు జీడి రైతుల సమస్యలపై ఆటపాటలు ఆకట్టుకోవడంతో పాటు ఆలోచింపజేశాయి. జీడిరైతు సంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్ కుమార్ అధ్యక్షతన నిర్వహించిన దీక్షలో ఏపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు, కె.హేమారావు చౌదరి, పి.కుసుమ, కె.బాలాజీరావు, కె.సింహాచలం, ఎ.రామకృష్ణ, కె.తవిటయ్య, ఎస్.ఈశ్వరరావు, ఎస్.కుమార్, జె.గవరయ్య, కె.గురయ్య కూర్చొన్నారు.

ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు

- 'గడప గడప' పనులకు బిల్లులు చెల్లించకపోవడం నిర్లక్ష్యమే
- ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులపై అసహనం
- ప్రభుత్వ కార్యక్రమాల అమల్లో క్రియాశీలకంగా వ్యవహరించాలి
- జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బొత్స సత్యనారాయణ

మాట్లాడుతున్న జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బొత్స సత్యనారాయణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందుల విషయంలో ఎవరైనా కృత్రిమ కొరత సృష్టిస్తే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. జెడ్‌పి సమావేశ మందిరంలో పాతపట్నం నియోజకవర్గ అభివృద్ధిపై అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులతో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. పంచాయతీరాజ్ శాఖను సమీక్షిస్తూ నియోజకవర్గ పరిధిలో చేపడుతున్న 208 ప్రాధాన్యతా భవనాలకు గానూ 129 భవనాలు తుది దశలో ఉన్నందున ఆగస్టు నెలాఖరుకు, మిగిలిన 79 భవనాలు ఈ ఏడాది చివరి నాటికి పూర్తి చేయాలని సూచించారు. తుది దశలో ఉన్న 61 సచివాలయాలు, 48 రైతుభరోసా కేంద్రాలు, 20 వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్స్ భవనాలను వచ్చే నెలాఖరు లోగా పూర్తి చేసి సంబంధిత శాఖలకు అప్పగించాలన్నారు. ఇప్పటివరకు చేపట్టిన భవనాలకు పూర్తి చెల్లింపులు జరిగాయని, మిగిలిన భవనాలకు కూడా సిమెంటు, ఇసుక, నిధుల కొరత లేదని స్పష్టం చేశారు. కొత్తూరులో గడప గడపకు మన ప్రభుత్వం కింద మంజూరైన నీటి ట్యాంకును ఫిబ్రవరిలో నిర్మించినా ఇప్పటివరకు బిల్లులు చెల్లించలేదని స్థానిక ప్రజాప్రతినిధి మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. బిల్లుల చెల్లింపుపై సరైన సమాధానం చెప్పలేకపోవడంతో ఆర్‌డబ్ల్యుఎస్ డిఇపై అసహనం వ్యక్తం చేశారు. గడప గడప పనులపై అన్ని నియోజకవర్గాలకు సంబంధించి సమీక్ష నిర్వహించాలని ఎస్ఇని ఆదేశించారు. నిధుల చెల్లింపుల్లో కావాలనే జాప్యం చేసినట్లు రుజువైతే సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు చేర్చడంలో అధికారులు క్రియాశీలక పాత్ర పోషించాలని సూచించారు.

ఎమ్మెల్యే రెడ్డి శాంతి మాట్లాడుతూ నియోజకవర్గానికి ప్రధానమంత్రి గ్రామీణ్ పథకం కింద తప్ప జగనన్న ఇళ్లు మంజూరు చేయకపోవడం ప్రజల్లో కొంత అసంతృప్తి ఉందని చెప్పారు. ప్రస్తుతం గృహనిర్మాణ శాఖ పిఎం గ్రామీణ్ కింద 3,163 గృహాలు మంజూరు చేశారని చెప్పారు. వీటితోపాటు మరో సొంత స్థలాలు కలిగిన 3,600 మందికి గృహాలు నిర్మించుకునేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. నియోజకవర్గంలో గిరిజనులు ఎక్కువగా నివసిస్తున్నందున, వారూ గృహాలు నిర్మించుకునేందుకు అనుమతిని కోరుతున్నారని మంత్రి దృష్టికి తీసుకొచ్చారు.

కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వంలో వచ్చిన పనుల వివరాలను తక్షణమే అప్‌లోడ్ చేయాలని ఎంపిడిఒలను ఆదేశించారు. హిరమండలం, ఎల్ఎన్‌పేట మండలం బొర్రంపేట పంచాయతీల్లోని సచివాలయాలను వచ్చే గురువారం నాటికి పూర్తి చేసి నివేదిక అందజేయాలని పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించారు. మెళియాపుట్టి, కొత్తూరు మండలాల్లోని దుర్గంపేట, మెట్టూరు పంచాయతీ పరిధిలో ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి తెలియజేస్తే, ఆ స్థలంలో గృహ నిర్మాణాలు చేపట్టేందుకు అనుమతిని మంజూరు చేస్తామని తహశీల్దార్లకు తెలిపారు. సమావేశంలో జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, టెక్కలి సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి, పంచాయతీరాజ్ శాఖ పర్యవేక్షక ఇంజినీర్ జయరాంకృష్ణ, గృహనిర్మాణ శాఖ పీడీ ఎన్.గణపతి, వ్యవసాయ, పశు సంవర్ధకశాఖ జెడిలు కె.శ్రీధర్, ఎం.కిషోర్, డ్వామా పీడీ జి.వి చిట్టిరాజు, సమగ్ర శిక్ష ఎపిసి ఆర్.జయప్రకాష్, జెడ్‌పి సిఇఒ ఆర్.వెంకట్రామన్, సిపిఒ వి.ఎస్.ఎస్.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

స్వాతంత్ర్య వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు

కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

77వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అధికారులను ఆదేశించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నిర్వహణపై కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో శుక్రవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకాకుళం నగరంఒని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానంలో ఉదయం తొమ్మిది గంటలకు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ప్రారంభమవుతాయని తెలిపారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బొత్స సత్యనారాయణ త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించి, ప్రసంగిస్తారని చెప్పారు. మేరా మిట్టి మేరా దేశ్ ప్రతి గ్రామ పంచాయతీలో 75 మొక్కలు నాటాలని, ఒక పైలాన్ ఏర్పాటు చేయాన్నారు. గ్రామాల్లో దేశం కోసం ప్రాణాలర్పించిన అమరవీరులను స్మరించుకోవాలని, విశ్రాంత ఉద్యోగులను సన్మానించాలని, పంచ ప్రాణ ప్రతిజ్ఞ, జెండా వందనం చేయాలన్నారు. అందుకు సంబంధిత శాఖల అధికారులు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.

పరేడ్ కార్యక్రమాన్ని ఎస్‌పి, వేదిక ఏర్పాట్లను ఇంజనీరింగ్ శాఖ, ఆర్‌డిఒ, తహశీల్దార్ పర్యవేక్షించాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఇనుమడింపజేసేలా శకటాలు, ఎగ్జిబిషన్ స్టాళ్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ శాఖల్లో ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగుల వివరాలు అందజేయాలన్నారు. ప్రతి శాఖ నుంచి ఇద్దరు, ముగ్గురికి మాత్రమే అవకాశం కల్పించాలని సూచించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, ఎస్‌పి జి.ఆర్ రాధిక, అటవీశాఖ అధికారి నిషాకుమారి, డిఆర్‌ఒ మురళీకృష్ణ, ఆర్‌డిఒ బి.శాంతి, నగరపాలక సంస్థ కమిషనర్ ఓబులేసు, డిఎస్‌ఒ వెంకటరమణ, డిఎంహెచ్ బి.మీనాక్షి పలు శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన నీరు

బూర్జ : జల జీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీటిని అందించనున్నట్లు శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని హరిపురంలో సుమారు రూ.ఏడు లక్షలు, తుడ్డలిలో సుమారు రూ.41 లక్షలు, డొంకలపర్తిలో సుమారు రూ.55 లక్షల నిధులతో జల జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ మంచినీటి కుళాయిల పథకానికి స్పీకర్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. డొంకలపర్తిలో సుమారు రూ.ఐదు లక్షలతో మినీ వాటర్ ప్లాంట్‌ను, ఫిష్ ఆంధ్రలో భాగంగా రాయితీపై అందిస్తున్న మినీ మొబైల్ వాహనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛమైన తాగునీటిని ప్రతి ఒక్కరికీ అందించడమే ప్రభుత్వ అంతిమ లక్ష్యమన్నారు. కలుషితమైన నీటిని తాగడం ద్వారా వ్యాధుల బారిన పడే అవకాశాలు ఉన్నాయన్నారు. నీటి లభ్యత, వినియోగంపై అందరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి బి.రామారావు, ఎంపిపి ప్రతినిధి కర్నేన నాగేశ్వరరావు, టిడ్కో డైరెక్టర్ ఖండాపు గోవిందరావు, వైస్ ఎంపిపిలు బూడుమూరు సూర్యారావు, కరణం కృష్ణంనాయుడు, డిసిఎంఎస్ డైరెక్టర్ జల్లు బలరాం నాయుడు, పలువురు సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ శాఖలో సంస్కరణలు

రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు

మాట్లాడుతున్న రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు

ప్రజాశక్తి - కోటబొమ్మాళి

రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ శాఖలో అనేక సంస్కరణలు తీసుకొచ్చిందని రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు తెలిపారు. మండలంలోని రేగులపాడు పంచాయతీ పరిధిలో సుమారు రూ.80 లక్షలతో నిర్మించిన సచివాలయ సముదాయాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వందేళ్ల కిందట బ్రిటిష్ వారు చేసిన సర్వే నేటికీ అమల్లో ఉందన్నారు. భూ రికార్డులు తప్పుల తడకలుగా ఉండడంతో గ్రామాల్లో భూ తగాదాలకు కారణమన్నారు. వాటిని దూరం చేసేందుకు సమగ్ర భూ సర్వే ఎంతగానో దోహదం కానుందన్నారు. ఇప్పటివరకు రెండు వేల సచివాలయాల్లో పూర్తయ్యాయని, రెండో దశలో మిగిలినవి పూర్తి చేయనున్నామని చెప్పారు. రైతుల సాగులో 20 ఏళ్ల ఉన్న అసైన్డ్ ల్యాండ్‌కు హక్కులు కల్పించామన్నారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా 15 లక్షల కుటుంబాలకు లబ్ధి చేకూరిందని చెప్పారు. సచివాలయాలతో ప్రజల వద్దకే పాలన వచ్చిందన్నారు. ప్రతిపక్షాలకు పని లేక జగనన్న కాలనీలో నీరు చేరింది, వాగులు పొంగుతున్నాయని విమర్శిస్తున్నాయన్నారు. వర్షాలు పడితే నీరు చేరదా? వాగులు పొంగవా? రహదారులు బురద కావా? అని ఎద్దేవా చేశారు. ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ హయాంలో న్యాయం జరిగిందని నమ్మితే వచ్చే ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డికి ఓటు వేయాలన్నారు. మళ్లీ జన్మభూమి కమిటీలే కావాలంటే మీ ఇష్టమన్నారు. కరోనా సమయంలో పక్క ఇంటికి వెళ్లాలంటే భయపడే రోజుల్లో వాలంటీర్లు మీ ఇంటికి వచ్చి రేషన్ అందించారని, అలాంటి వారిపై అవగాహన లేని నాయకుడు మాట్లాడే మాటలకు బాధపడాల్సిన పని లేదన్నారు. కార్యక్రమంలో వైసిపి టెక్కలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి దువ్వాడ వాణి, ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరరావు, జెడ్‌పిటిసి దుబ్బ వెంకటరావు, పిఎసిఎస్ అధ్యక్షులు బాడాన మురళి, మండల పరిషత్ ఉపాధ్యక్షులు బోయిన నాగేశ్వరరావు, దుక్క రోజారామకృష్ణ, మండల కో-ఆప్షన్ మెంబర్ షేక్‌రంజాన్ రాజు, అన్నెపు రామారావు తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ప్రైవేటీకరణ ఆపాలి

ధర్నా చేస్తున్న రైల్వే కాంట్రాక్టు కార్మికులు

ప్రజాశక్తి - ఆమదాలవలస

రైల్వే ప్రైవేటీకరణ ఆపాలని, రైల్వే కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆలిండియా రైల్వే కార్మికుల డిమాండ్స్ డే సందర్భంగా శ్రీకాకుళం రోడ్డు రైల్వేస్టేషన్ వద్ద రైల్వే కాంట్రాక్ట్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యాన రైల్వే కార్మికులు శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, రైల్వే కాంట్రాక్టు కార్మికులందరినీ క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. రైల్వేలో శాశ్వత స్వభావం గల పనులన్నింటిలో ఉన్న కాంట్రాక్టు కార్మికులందరికీ రైల్వేలో ఉద్యోగాలు కల్పించాలన్నారు. కాంట్రాక్టర్లు మారినా కార్మికులను పనిలో కొనసాగించాలని డిమాండ్ చేశారు. టెండర్ అగ్రిమెంట్స్‌లో కాంట్రాక్టర్స్ మారినా కార్మికులను తొలగించరాదనే నిబంధనను పొందుపరచాలన్నారు. కాంట్రాక్టు కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, 60 ఏళ్ల వరకు వారిని కొనసాగించాలని డిమాండ్ చేశారు. నియామక పత్రాలు, గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. ప్రతినెలా ఐదో తేదీ లోపు జీతాలను రైల్వే యజమాన్యమే చెలించేలా బాధ్యత వహించాలన్నారు. పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యాలను అమలు చేయాలన్నారు. బోనస్, వర్కమెన్ కాంపన్సేషన్, ప్రసూతి సెలవులు తదితర సాంఘిక భద్రతా సౌకర్యాలు కల్పించాలని కోరారు. ధర్నాలో ఫెడరేషన్ నాయకులు వి.ఆదినారాయణ, జనవిజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షులు బొడ్డేపల్లి జనార్ధనరావు, రిటైర్డ్ రైల్వే శ్రామిక కాంగ్రెస్ పూర్వ కార్యదర్శి బెండి సూర్యనారాయణ, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా కోశాధికారి టి.సంతోష్ కుమార్, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు పి.తిరుపతిరావు, పి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

టెక్కలి సబ్ కలెక్టర్ బదిలీ

ప్రజాశక్తి - టెక్కలి

టెక్కలి సబ్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి బదిలీ అయ్యారు. ఉద్యోగోన్నతిపై నంద్యాల జిల్లా జాయింట్ కలెక్టర్‌గా వెళ్లనున్నారు. ఈ మేరకు ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. కడప జిల్లాకు చెందిన రాహుల్‌కుమార్ రెడ్డి 2020 ఐఎఎస్ బ్యాచ్‌కు చెందిన వారు. ఏలూరులో ట్రైనీ కలెక్టర్‌గా విధులు నిర్వర్తించారు. 2022 అక్టోబరు 16వ తేదీన టెక్కలి సబ్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఆయన స్థానంలో ఇంకా ఎవరినీ నియమించలేదు.

మణిపూర్ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలి

ర్యాలీ నిర్వహిస్తున్న దళిత, గిరిజన, బిసి, ప్రజాసంఘాల నాయకులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

మణిపూర్‌లో శాంతిభద్రతల పరిరక్షణలో విఫలమైన ఆ రాష్ట్ర ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలని దళిత, గిరిజన, బిసి, మైనార్టీ, ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. మణిపూర్‌లో మహిళలపై అత్యాచారాలను అరికట్టాలని, శాంతిని నెలకొల్పాలని డిమాండ్ చేస్తూ ఐక్యవేదిక ఆధ్వర్యాన నగరంలోని అంబేద్కర్ కూడలి నుంచి డేఅండ్‌నైట్ కూడలి వరకు శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. మణిపూర్‌లో మారణకాండను అరికట్టాలని, క్రైస్తవులు, చర్చిలపై దాడులను నివారించాలని, మహిళలను నగ్నంగా ఊరేగించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, మణిపూర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలనీ, మోడీ-షా సర్కార్ మౌనం వీడి తమ అభిప్రాయాన్ని ప్రకటించాలని ర్యాలీ పొడవునా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రచయిత, కవి అట్టాడ అప్పలనాయుడు, నల్లి ధర్మారావు, సన్నశెట్టి రాజశేఖర్ మాట్లాడుతూ తరతరాలుగా కలసిమెలసి జీవిస్తున్న మైతేయి, కుకీ, నాగాల మధ్య మత చిచ్చు రగిలించి, రాజకీయ లబ్ధి కోసం ప్రయత్నిస్తున్న కేంద్రం, రాష్ట్రంలోని బిజెపి ప్రభుత్వాలు మారణహోమానికి ప్రధాన ముద్దాయిలు అని అన్నారు. మైనార్టీలపై హత్యలు, అత్యాచారాలు, దమనకాండలపై సుప్రీంకోర్టు స్వయంగా విచారణ చేపట్టాలని, మహిళలను నగ్నంగా ఊరేగించి, హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మణిపూర్ పర్వత ప్రాంతాల్లో ఉన్న ఖనిజ సంపదను కార్పొరేట్ శక్తులకు అప్పగించాలన్న దురుద్దేశంతో బిజెపి ప్రభుత్వం చేస్తున్న దుర్మార్గ చర్యలను తీవ్రంగా ఖండించారు. దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తుతున్నా, ప్రపంచవ్యాప్తంగా దేశ పరువు మంటగలుస్తున్నా కేంద్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తోందన్నారు. మైతేయి తెగ ముసుగులో ఆర్ఎస్ఎస్, విహెచ్‌పి, భజరంగ్‌దళ్ సాగిస్తున్న మతోన్మాద దాడులను ఖండించారు. కేంద్ర ప్రభుత్వం వీటిని నివారించకపోతే తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎన్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు కె.రాంగోపాల్, జిల్లా ప్రధాన కార్యదర్శి డి.గణేష్, కెఎన్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు మిస్క కృష్ణయ్య, పలు సంఘాల నాయకులు పి.చంద్రపతిరావు, షానో, ఎజ్రా, పోతాల దుర్గారావు, తాండ్ర ప్రకాష్, వి.జి.కె మూర్తి, జి.సింహాచలం, టి.తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

స్త్రీ విముక్తి సంఘటన ఆధ్వర్యాన...

స్త్రీ విముక్తి సంఘటన ఆధ్వర్యాన నగరంలోని ఎన్‌జిఒ హోం నుంచి పొట్టి శ్రీరాములు కూడలి వరకు నిరసన ప్రదర్శన చేపట్టారు. ఎన్‌జిఒ హోంలో సంఘటన జిల్లా కార్యదర్శి తాండ్ర అరుణ అధ్యక్షతన సభ నిర్వహించారు. కార్యక్రమంలో ఎపిటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొప్పల భానుమూర్తి, రైతుకూలీ సంఘం రాష్ట్ర సహాధ్యక్షులు వర్మ, జనసాహితి జిల్లా కార్యదర్శి పి.మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

ఎస్‌పి జి.ఆర్ రాధిక

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

ఆరోగ్యంపై శ్రద్ధ వహించి శారీరకంగా, మానసికంగా ధృడంగా ఉండాలని ఎస్‌పి జి.ఆర్ రాధిక పోలీస్ సిబ్బందికి సూచించారు. ఎచ్చెర్ల ఆర్మ్‌డ్ రిజర్వు పోలీస్ మైదానంలో జిల్లావ్యాప్తంగా అన్ని సర్కిల్ కార్యాలయాల పరిధిలో పోలీస్ సిబ్బందితో పెరేడ్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. పరేడ్‌ను పరిశీలించి, సిబ్బంది గౌరవ వందనాన్ని ఎస్‌పి స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలీసు శాఖలో సిబ్బందికి క్రమశిక్షణ ముఖ్యమన్నారు. శారీరకంగా, మానసికంగా ఉత్సాహంతో ఉన్నప్పుడే ప్రజలకు సేవలు అందించగలమని తెలిపారు. పోలీసు సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ ఆర్మ్‌డ్, సివిల్, ట్రాఫిక్ పోలీసు సిబ్బంది సమస్యలపై గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. సిబ్బంది అనారోగ్య, ఉద్యోగ, వ్యక్తిగత సమస్యలను విన్నవించగా, సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎస్‌పి భరోసానిచ్చారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పిలు టి.పి విఠలేశ్వర్, జె.తిప్పేస్వామి, డిఎస్‌పిలు వై.శృతి, ఎస్.బాలరాజు, జి.వి ప్రసాదరావు, ఆర్ఐ బి.ప్రదీప్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అత్యాశకు పోయి మోసపోవద్దు

రూ.రెండు వేల నోట్లు రద్దయిన నేపథ్యంలో కొందరు వ్యక్తులు నోట్ల మార్పిడికి అసలు నగదు కంటే అదనంగా ఇస్తామని ఆశ చూపి మోసగిస్తున్నారని ఎస్‌పి జి.ఆర్ రాధిక ఒక ప్రకటనలో తెలిపారు. రూ.500 నోట్ల కట్టలు అందిస్తే అంతకు పది శాతం కలిపి రూ.రెండు వేల నోట్లు అందిస్తామని మాయ మాటలు చెప్పి మోసగిస్తున్నారని పేర్కొన్నారు. అత్యాశకు పోయి మోసపోవద్దని సూచించారు. ఇలాంటి మాయమాటలు చెప్పే అపరిచిత వ్యక్తులు తారసపడితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

విద్యతో పాటు క్రమశిక్షణ అవసరం

ప్రజాశక్తి - రణస్థలం

ప్రతి విద్యార్థికీ విద్యతో పాటు క్రమశిక్షణ అవసరమని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.జ్యోతికుమారి అన్నారు. మండలంలోని లంకపేట కెజిబివి పాఠశాలను శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రయివేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు ఆటలు, పాటలు, వ్యాయామం తదితర వాటిపై ఆసక్తి కలిగించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం మండల కేంద్రంలోని మండల విద్యావనరుల కేంద్రాన్ని తనిఖీ చేశారు. సిఆర్‌పిలను విద్యార్హతలను బట్టి సిఆర్‌ఎంటిలుగా ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. సిఆర్‌ఎంటి విధులతో పాటు సిఆర్‌పిలుగానూ విధులు నిర్వహించాలని తెలిపారు. సింగిల్ టీచర్ పాఠశాలల్లో ఉపాధ్యాయులు సెలవుపై వెళ్లినప్పుడు ఆయా పాఠశాలలకు వెళ్లేటప్పుడు విద్యా ప్రమాణాల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఎంఆర్‌సి నిర్వహణను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆమె వెంట ఎంఇఒ ఎ.త్రినాథరావు, సిఆర్‌పిలు ఆర్.పాపినాయుడు, యు.శ్రీనివాస్, జె.శ్రీనివాస్, వై.యోగానంద్, ఎస్.రామకృష్ణ, జి.రామకృష్ణ, జి.గౌరినాయుడు తదితరులున్నారు.

SHRIRAM Finance

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

రిజిస్టర్డ్ ఆఫీస్: శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై - 600032

జోనల్ కార్యాలయం : సరస్వతీ కాంప్లెక్స్ 1వ అంతస్తు, ఎస్.వి.సి.థియేటర్ ప్రక్కన, రామలక్ష్మణ జంక్షన్, శ్రీకాకుళం.

సవరణ

తేది 18-7-2023 న ప్రజాశక్తి శ్రీకాకుళం జిల్లా 5వ పేజీలో ప్రచురించిన డిమాండ్ నోటీస్ పాపారావు శిమ్మ వారి ప్రకటనలో అగ్రిమెంట్ NSNPTTF1804300011, బకాయి మొత్తం రూ.95,28,732/- ప్రకటనలో అగ్రిమెంట్ నెం.NSNPTTF1903200005 అని చదువుకోవలెను. మిగతా సమాచారం యధావిధం.

తేది : 20-07-2023 ప్రదేశం : శ్రీకాకుళం సం/- అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

ప్రజాశక్తి
www.prajasakti.com

పాటల సిడిని ఆవిష్కరిస్తున్న మోహనరావు

జీడి మద్దతు ధరపై
'రంగం' పాటల సిడి ఆవిష్కరణ

ప్రజాశక్తి- పలాస

పలాసలో జరుగుతున్న జీడీ రైతుల సత్యాగ్రహ దీక్షలో రంగం ప్రజా సాంస్కృతిక వేదిక ఒక గీతాన్ని రూపొందించింది. జీడి మద్దతు ధరపై రంగం పాటలను ఎపి రైతు సంఘ జిల్లా కార్యదర్శి కొనారి మోహనరావు, జీడీ రైతుల సంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్ కుమార్ చేతుల మీదుగా శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీడి పిక్కలకు గిట్టుబాటు ధర కలిపించాలని మూడు నెలలగా ప్రజాస్వామ్య పద్ధతుల్లో నిరసనలు తెలియజేస్తున్న ప్రభుత్వాలకు, అధికారులకు సమస్యను పరిష్కరించాలని ఆలోచన లేకపోవడం పాలకుల దౌర్భాగ్యమని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఈ సమస్యలు పరిష్కారం చేయకుంటే ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ ఉద్యమనికి రంగం రాజేష్ అందించిన పోరు గీతం నూతన ఉత్తేజాన్ని ఇస్తుందని అన్నారు. రంగం ప్రజా సాంస్కృతిక వేదిక రాష్ట్ర అధ్యక్షులు కొనారి హేమసుధన్ మాట్లాడుతూ రంగం భయం కరమైన తిత్లీ తుపానుతో ఉద్దానం కష్టాల్లో ఉన్న 'ముద్దుగా ఉండే ఉద్దానం మద్దయిపోయిందో తడిసి ముద్దాయి పోయిందో' అంటూ ప్రత్యేక గీతాన్ని రూపొందించి పలాసలో ఆట-పాట కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రంగం రాష్ట్ర ప్రచార కార్యదర్శి దుబ్బ రాజగోపాల్, రచయిత కాంతారావు మాస్టర్, ప్రజాగాయకుడు కోటి, డొక్కరి కమేష్, బాలాజీరావు శంకర్ పాల్గొన్నారు.

రాట్నంపై దారం తీస్తున్న ప్రక్రియను పరిశీలిస్తున్న రాగ్

ఖాదీ అభివృద్ధికి ముందుకు రావాలి

పొందూరు: ఖాదీ పరిశ్రమ అభివృద్ధి చెందాలంటూ ఈ పరిశ్రమలోకి యువతీ యువకులు ముందుకు రావాలని విశాఖ ఛాంబర్ ఆఫ్ కామర్స్ మహిళా విభాగం (విసిసిఐ) అధ్యక్షులు ఈజివల్సు రాగ్ తెలిపారు. స్థానిక సన్న ఖాదీ కార్మికాభివృద్ధి సంస్థను శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువతీ, యువకులకు శిక్షణను ఇప్పించేందుకు ఖాదీ గ్రామోద్యోగ కమిషన్ (కెవిఐసి) చర్యలు తీసుకోవాలని కోరారు. గాంధీజి కలలుగన్న ఖాదీ ప్రపంచం చిరకాలం వర్ధిల్లాలని ఆకాక్షించారు. ఈ సందర్భంగా పట్టణంలో కార్మికులు చేపడుతున్న ఖాదీ వడుకు, నేత ప్రక్రియలను పరిశీలించారు. ఈమెతో పాటు విశాఖ మహిళా వాకర్స్ క్లబ్ పూర్వ అధ్యక్షులు దర్భా శిరీష, విశాఖ ఆరోహణ గిరిజన కార్యదర్శి సురేఖా పట్నాయక్, ఖాదీ సంస్థఅధ్యక్ష, కార్యదర్శులు జి.కె.ప్రసాద్, డి.వెంకటరమణ ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

శ్రీకాకుళం అర్బన్ : మొక్కను నాటుతున్న కలెక్టర్ దంపతులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

గ్రీన్ ఎర్త్, గ్రీన్ ఆంధ్రప్రదేశ్ అన్న నినాదంతో ఐఎఎస్ అధికారుల సతీమణుల అసోసియేషన్ ఆధ్వర్యాన నగరంలోని కంపోస్టు కాలనీలో కలెక్టర్ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం సందర్భంగా శ్రీకేష్ లాఠకర్, ఆయన సతీమణి శైలిలు కలిసి శుక్రవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మొక్కల నాటడంతో పాటు వాటిని సంరక్షించే బాధ్యతనూ నిర్వర్తించాలన్నారు. జిల్లాలో ఏటా పెద్దఎత్తున మొక్కలు నాటుతున్నా వాటి సంరక్షణ సరిగా లేక అనేక చోట్ల కనుమరుగవుతున్నాయని అన్నారు. అందువల్ల ప్రతిఒక్కరూ ఒక మొక్కను దత్తత తీసుకుని సంరక్షించడం ద్వారా పచ్చదనాన్ని పెంచాలన్నారు. ప్రపంచ ప్రకతి పరిరక్షణ దినోత్సవాన్ని ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న సంఘం ప్రతినిధులకు ఆయన అభినందించారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ ఓబులేసు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పలాస : ప్లాస్టిక్ కవర్లతో పశువులకు ప్రాణసంకటకంగా మారుతోందని పశుసంవర్ధకశాఖ ఎడి డాక్టర్ పి.చంద్రశేఖర్ అన్నారు. ప్రకృతి పరిరక్షణ దినోత్సవం సందర్భంగా స్థానిక స్వచ్ఛంద సంస్థ గ్రీన్‌ఆర్మీ ఆధ్వర్యాన పశువైద్యశాల వద్ద మొక్కలు నాటారు. కార్యక్రమంలో సంతోష్‌కుమార్, ఆర్.శాంతకుమారి, డి.వైకుంఠరావు, కె.చిన్నాచారి, ఎన్.అనిల్‌కుమార్, ప్రదీప్‌కుమార్, ఆర్.వెంకటరమణ పాల్గొన్నారు.

పొందూరు: మండలంలోని తాడివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నేషనల్ గ్రీన్‌కోర్ ఆధ్వర్యాన ఉపాధ్యాయులు, విద్యార్థులు 72 మొక్కలు నాటారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బల్ల కంటయ్య, నేషనల్ గ్రీన్‌కోర్ క్లస్టర్ కో-ఆర్డినేటర్ పూజారి హరిప్రసన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొత్తూరు : గాలి, నీరు, భూమి కలిసితం కాకుండా గ్రామాల్లోని ప్రజలకు అవగాహన కల్పించాలని వెలుగు కార్యదర్శి బి.సంజీవరావు అన్నారు. ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం సందర్భంగా స్థానిక వెలుగు అసోసియేషన్ కార్యాలయంలో గ్రామీణ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గాలి నీరు, భూమి ప్రకృతి ప్రసాదించిన వనరు అని అన్నారు. దీనిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలనానరు. ఎక్కడ పడితే అక్కడ చెత్త చెదారాలను వేయకుండా చెత్త సంపద కేంద్రాలకు తరలించాలన్నారు. కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్ కె.దాసునాయుడు, హరీష్‌లు పాల్గొన్నారు.

కొత్తూరు : మాట్లాడుతున్న సంజీవరావు

పేదల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

శాసనసభ స్పీకర్ సీతారాం

ప్రజాశక్తి- బూర్జ

పేదల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయమని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని తోటవాడ పంచాయతీ కొమ్మువలస, రాజుపేట గ్రామాల్లో శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామానికి చెందిన పలువురుతో మాట్లాడి వారి నుంచి సంక్షేమ పథకాలు అమలు తీరు తెన్నులు గురించి సమాచారం తెలుసుకున్నారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అందిస్తున్న జగనన్న ప్రభుత్వం దేశానికే ఒక ఆదర్శమన్నారు. ముందుగా కొమ్మువలసలో భద్రమ్మ చెరువుకు రూ.2.50 లక్షలతో నిర్మించిన మెట్లను ప్రారంభించారు. అలాగే కొమ్మువలసలో రూ.12 లక్షలు, రాజుపేటలో రూ.42 లక్షల జల జీవన్ నిధులతో ఇంటింటికీ తాగునీటి కుళాయి పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి కర్నెన నాగేశ్వరరావు, జెడ్‌పిటిసి బెజ్జిపురపు రామారావు, టిడ్కో రాష్ట్ర డైరెక్టర్ ఖండాపు గోవిందరావు, వైస్ ఎంపిపిలు, సర్పంచ్ సూర ఆనందరావు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను వివరిస్తున్న స్పీకర్ సీతారాం

పారిశుద్ధ్య నిర్వహణపై దృష్టి

పనులను పరిశీలిస్తున్న కుమార్ మోహన్ రెడ్డి

ప్రజాశక్తి- కవిటి

మండలంలోని నెలవంక పంచాయతీలో పారిశుధ్యం నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించామని సర్పంచ్ ప్రతినిధి కుమార్ మోహన్ రెడ్డి తెలిపారు. మూడు రోజులుగా పంచాయతీలో చేపడుతున్న జంగిల్ క్లియరెన్స్, పారిశుద్య పనులు చేపడుతున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం సీమూరులో జరుగుతున్న జంగిల్ క్లియరెన్స్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాకాలంలో వ్యాధుల తీవ్రత పెరిగే ప్రమాదం ఉందని, దీన్ని దృష్టిలో ఉంచుకుని పంచాయతీ వ్యాప్తంగా గ్రామాల్లో జంగిల్ క్లియరెన్స్, పారిశుద్య పనులు చేపడుతున్నట్టు తెలిపారు. అలాగే గ్రామస్తులు కూడా గ్రామాలు పరిశుభ్రంగా ఉంచుకుని, వ్యాధులు వ్యాప్తి చెందకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో ఇందు శేఖర్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

కవిటి: మండలంలోని మణిక్యపురం 11 కెవి ఫీడర్, ఆర్‌డబ్ల్యుఎస్ 11 కెవి ఫీడర్స్ పరిధిలోని రహదారి మార్గంలో ఉన్న పాత విద్యుత్ స్తంభాలు తొలగించడంలో భాగంగా శనివారం ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు పలాస ఇఇ జి.ప్రసాదరావు ఒక ప్రకటనలో తెలిపారు. వీటి పరిధిలోని వరక, కుసుంపురం, బల్లిపుట్టుగ, మణిక్యపురం పంచాయతీ గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు చెప్పారు. వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని కోరారు.

జలుమూరు: చల్లవానిపేట సబ్ డివిజన్ పరిధి 11 కెవి ఫీడర్‌లో శనివారం విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తున్నట్లు ఆ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎ.రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆ ఫీడర్‌లో విద్యుత్ మరమ్మతు పనులు, చెట్ల కొమ్మలు తొలగింపు పనులు చేపడుతున్న కారణంగా టెక్కలిపాడు, తిలారు, చిన్నదూగాం, పెద్దదూగాం, నారాయణవలస, లింగాలవలస గ్రామాలకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తున్నామని చెప్పారు.

రేపు సదస్సు

కోటబొమ్మాళి : ఈ నెల 30న టెక్కలిలో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విజ్ఞాన మందిరంలో సమతా సైనిక్‌దళ్ ఆధ్వర్యాన జరగనున్న భారత రాజ్యాంగంపై అవగాహనా సదస్సు నిర్వహిస్తున్నామని జిల్లా సమన్వయకర్త చల్లా రామారావు తెలిపారు. ఈ సదస్సు విజయవంతంపై మండలంలోని అక్కయ్యవలస, జీయన్నపేట, కురుడు, కిష్టుపురం తదితర గ్రామాల్లో దళిత వాడలను సందర్శించి శుక్రవారం పోస్టర్లను అందజేశారు. దళితులు, గిరిజనులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పిలక చంటి, పేర నాగేశ్వరరావు పాల్గొన్నారు.

గోడ కూలడంతో దెబ్బతిన్న బైక్

కూలిన ఇంటి గోడ

ప్రజాశక్తి- జలుమూరు

వాయుగుండం ప్రభావంతో నాలుగు రోజులుగా కురిసిన వర్షాలకు మండలంలోని బొడ్డపాడుకు చెందిన కోనేటి రమణమూర్తికి చెందిన మట్టి ఇల్లు గోడ గురువారం అర్ధరాత్రి కూడలింది. అందరూ నిద్రపోతున్నప్పుడు బయట వైపు కూలిపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఆ గోడ ఇంటి లోపల వైపు కూలిపోయి ఉంటే పెద్ద ప్రమాదమే జరిగేదని స్థానికులు అంటున్నారు. దీంతో కూలిన గోడ దగ్గర టార్పాలిన్ కట్టి ఆ ఇంట్లోనే కుటుంబం నివసిస్తోంది. ఆ గోడ బయటి వైపున కూలిపోవడంతో అక్కడ పెట్టిన మూడు ద్విచక్ర వాహనాలు దెబ్బతిన్నాయి. ప్రభుత్వం తమను ఆదుకోవాలని ఆ కుటుంబ సభ్యులు కోరుతున్నారు. సర్పంచ్ అంపోలు భాను తిరుపతిరావు సచివాలయం కార్యదర్శి, విఆర్‌ఒలకు సమాచారం అందించడంతో వారు పరిశీలించారు. మండలంలోని తిలారు రైల్వే స్టేషన్‌కు సమీపంలో తూర్పు వైపున నిర్మిస్తున్న రైల్వే అండర్ టన్నల్ పూర్తిగా నిండిపోయి ంది. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కృష్ణదాస్

ముంపు ప్రాంతాలు పరిశీలన

జలుమూరు : వాయుగుండం ప్రభావంతో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలోని కూర్మనాథపురం వద్ద గురువారం 3 ఆర్ ఛానల్‌కు గండిపడి పడింది. దీంతో పరిసర గ్రామాల్లోని పంటపొలాలు ముంపునకు గురయ్యాయి. దీంతో ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ వ్యవసాయాధికారులతో ముంపు పంట పొలాలను శుక్రవారం పరిశీలించారు. నీరు తొలగింపునకు చర్యలు తీసుకోవాలని, యుద్ధ ప్రాతిపదికన గండిని పూడ్చాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపిపి వాన గోపి, వైస్ ఎంపిపి తంగి మురళీకృష్ణ, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షులు దామ మన్మథరావు పాల్గొన్నారు.

పుష్పగుచ్ఛం అందజేస్తున్న 'ఎన్ఇఆర్'

పురందేశ్వరిని కలిసిన 'ఎన్ఇఆర్'

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

రాష్ట్ర బిజెపి అధ్యక్షులుగా దగ్గుబాటి పురందేశ్వరి పదవీ బాధ్యతలు చేపట్టిన తరువాత తొలిసారిగా శుక్రవారం ఉత్తరాంధ్ర పర్యటనకు విచ్చేశారు. ఈ మేరకు విశాఖపట్నం విమానాశ్రయం వద్ద ఎచ్చెర్ల నియోజకవర్గ బిజెపి కన్వీనర్ నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఇఆర్) వెళ్లి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం పార్టీ కార్యాలయంలో ఎచ్చెర్ల నియోజకవర్గంలో పార్టీ బలోపేతం చేసేందుకు పలు విషయాలు చర్చించినట్లు ఎన్ఇఆర్ తెలిపారు. ఆయనతో పాటు బెజ్జిపురం మాజీ సర్పంచ్ ఇజ్జాడ శ్రీనివాసరావు, బంటుపల్లి ఎంపిటిసి మాజీ సభ్యులు గురాల రఘునాథ్, ఎస్.నాగేశ్వరరావు, టి.అప్పలరాజు, దుక్క ఆదినారాయణ, దన్నాన రాజేంద్ర, లెంక అప్పలనాయుడు, పి.వి.రత్నం ఉన్నారు.

వందో రోజుకు 'అన్నా క్యాంటీన్'

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

తెలుగుదేశం జాతీయ అధ్యక్షులు చంద్రబాబు ఆశయ సాధనే లక్ష్యంగా అన్న క్యాంటీన్‌ను పున:ప్రారంభించామని, దీనివల్ల పేదలకు పట్టెడు అన్నం దొరకుతుందన్నదే ముఖ్య ఉద్దేశంతో రోజూ క్యాంటీన్ నిర్వహిస్తున్నామని సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షులు, టిడిపి నాయకులు గొండు శంకర్ అన్నారు. నగరంలోని ఏడు రోడ్ల కూడలి వద్ద నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్ శుక్రవారంతో వందో రోజుల పాటు నిర్విరామంగా సాగిస్తున్నామని తెలిపారు. వంద రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ముందుగా ఎన్‌టిఆర్, ఎర్రన్నాయుడు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు రెడ్డి శంకర్ పాల్గొన్నారు.

వడ్డిస్తున్న గొండు శంకర్

పంట రుణాల బకాయిలు రద్దు చేయాలి

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి- రణస్థలం

రైతుల పంట రుణాల బకాయిలను రాష్ట్ర వ్యాప్తంగా రద్దు చేయాలని, రైతు రుణ ఉపశమన చట్టాన్ని పార్లమెంటో ఆమోదించేలా కృషి చేసి రైతులను, కౌలు రైతులను ఆత్మహత్యల నుంచి రక్షించాలని ఎపి కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెలమల రమణ, పి.ప్రసాదరావు డిమాండ్ చేశారు. జూలై 30న విజయవాడలో అఖిల పక్ష రైతు, కౌలు రైతు సంఘాల రాష్ట్ర సదస్సు విజయవంతం చేయాలని పిలుపునిస్తూ... శుక్రవారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంటలన్నిటికీ సమగ్ర పంటల ఉత్పత్తి వ్యయానికి 50 శాతం కలిపి చట్టబద్ధ, కనీస మద్దతు ధరలను నిర్ణయించాలని డిమాండ్ చేశారు. స్వామినాథన్ సిఫార్సులు అమలు చేయాలన్నారు. కౌలు రైతులకు భూయజమాని ప్రమేయం లేకుండానే గుర్తింపు కార్డులు జారీ చేయాలని, తద్వారా రైతు భరోసా, స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పంట రుణాలు అందజేయాలని అన్నారు. విద్యుత్ సవరణ బిల్లు రద్దు చేయాలని, విద్యుత్ ట్రూ ఆఫ్ ఛార్జీలు తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో జీడి పిక్కలను బస్తాకు రూ.16 వేలు చొప్పున మద్దతు ప్రకటించిన రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలన్నారు. కార్మికుల హక్కులకు నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్లు రద్దు చేసి కార్మికుల హక్కులను పునరుద్ధరించాలని అన్నారు. మణిపూర్ రాష్ట్రంలో జరిగిన మారణకాండకు బాధ్యత వహిస్తూ ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎ.శిమ్మారావు, ఎ.నారాయణరావు, ఇ.గురినాయుడు, ఎస్.ఆదినారాయణ, ఎస్.రాము పాల్గొన్నారు.

భరోసానిచ్చే కార్డు 'ఈ-శ్రమ్'

అసిస్టెంట్ లేబర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు

ఈ-శ్రమ్ కార్డు నమోదు చేస్తున్న శ్రీనివాసరావు

ప్రజాశక్తి- రణస్థలం

అసంఘటిత రంగంలో పనిచేసే వారికి భరోసానిచ్చే కార్డు ఈ-శ్రమ్ అని జిల్లా అసిస్టెంట్ లేబర్ ఇన్‌స్పెక్టర్ ఆర్.వి.శ్రీనివాసరావు అన్నారు. మండల కేంద్రంలో ఈ-శ్రమ్ కార్డులను శుక్రవారం నమోదు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అసంఘటిత రంగంలో పనిచేసే వారికి ఎలాంటి ఇపిఎఫ్, ఇఎస్ఐ ఉండరాదని అన్నారు. అలాంటి వారికి ఆర్థిక, సామాజిక భద్రత అందించడానికి కేంద్ర ప్రభుత్వం 2021లో ఈ-శ్రమ్ కార్డును తీసుకొచ్చిందని తెలిపారు. దీన్ని లేబర్ అండ్ ఎంప్లాయిమెంట్ మంత్రిత్వ శాఖ నిర్వహిస్తుందని ఈ-శ్రమ్ పోర్టల్లో నమోదు చేసుకున్న వారికి రూ.2 లక్షల లైఫ్ ఇన్స్యూరెన్స్, రూ.లక్ష ప్రమాద బీమా వర్తిస్తుందని అన్నారు. వీటితో పాటు ప్రభుత్వం అందించే పథకాలు, ప్రయోజనాలు నేరుగా ఈ-శ్రమ్ ద్వారా అందజేస్తారన్నారు. దీనికి ఎవరు అర్హులు, ఇందులో ఎలా నమోదు చేసుకోవాలి అనే విషయాలు అసంఘటిత రంగంలో పనిచేసే వారు తప్పనిసరిగా తెలుసుకోవాలన్నారు. అసంఘటిత రంగంలో పని చేసేవారు 16-59 వయసు మధ్య ఉన్న వారందరు దీనికి అర్హులన్నారు. ఆధార్ కార్డుతో లింక్ అయినా ఫోన్, బ్యాంకు ఖాతా నంబరుతో పాటు ఐఎఫ్ఎస్‌సి కోడ్ డాక్యుమెంట్స్ కావాలన్నారు.

కక్షసాధింపు తగదు

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం పట్టణ టిడిపి అధ్యక్షులు కాళ్ల ధర్మారావు రెండు ఎకరాల స్థలం కాంపౌండ్ వాల్‌ను ప్రొక్లెయినర్‌తో తొలగించి కక్ష సాధింపు చర్యలకు పాల్పడడం అన్యాయమని యాదవ సాధికారిత జిల్లా కన్వీనర్ కుప్పిలి జగదీశ్వరావు ఒక ప్రకటనలో తెలిపారు. దీనిపై టిడిపి యాదవ సంఘం నాయకులు ఖండించాలని పిలుపునిచ్చారు. ఈయనతో పాటు టిడిపి రాష్ట్ర బిసి సెల్ ప్రధాన కార్యదర్శి లోడగల కామేశ్వరరావు యాదవ్, కార్యదర్శి సాలిన ఢిల్లేశ్వరరావు యాదవ్, దాసరి తాతారావు యాదవ్, జీడీ కార్మిక నాయకులు అంబటి కృష్ణమూర్తి యాదవ్ ఉన్నారు.

తాడివలసలో రికార్డులను పరిశీలిస్తున్న ఎంపిడిఒ హరిహరరావు

అలసత్వం వహిస్తే చర్యలు

పొందూరు: సచివాలయం సిబ్బంది విధుల నిర్వాహణలో ఆలసత్వం వహిస్తే చర్యలు తప్పవని ఎంపిడిఒ సీపాన హరిహరరావు హెచ్చరించారు. మండలంలోని కనిమెట్ట, కింతలి, మొదలవలస, తాడివలస, పెనుబర్తి, కొంచాడ గ్రామ సచివాలయాలను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు సచివాలయాల్లో సిబ్బంది సమయపాలన పాటించకపోవడంపై మండిపడ్డారు. సమయానికి విధులకు హాజరుకాకపోయినట్లు వారికి జీతాలను సైతం నిలిపివేస్తామని హెచ్చరించారు. సచివాలయానికి వచ్చే అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. అనంతరం గోరింటలో చేపడుతున్న ఇంటింటా సర్వేను పరిశీలించారు. ఈయనతో పాటు పంచాయతీ కార్యదర్శులు నాగరాజు, మనోజ్‌కుమార్ ఉన్నారు.

'ఆధార్'ం లేదు

ఓ గిరిజన వృద్ధుని ఆవేదన

ప్రజాశక్తి- మెళియాపుట్టి

ప్రతి వ్యక్తికీ ఆధార్ అనేది తప్పనిసరి. ఆధార్ లేనిదే మనిషికి గుర్తింపు లేదు. అటువంటి పరిస్థితి మండలంలోని పెంగువాడకు చెందిన 70 ఏళ్ల వ్యక్తి జి. లచ్చయ్య అనే గిరిజన వృద్ధుడి దుస్థితి ఇది. ఇప్పటికీ ఈ వృద్ధుడికి ఆధార్ కార్డు లేదంటే విడ్డూరమే. భార్య, బిడ్డలు లేక ఒంటరిగానే జీవిస్తున్నాడు. ఆస్తుపాస్తులు లేక ఉండేందుకు నివాసం లేక గ్రామ సమీపంలోని జీడి తోటలో కొన్నేళ్లుగా చిన్న కుటీరంలో ఉండేవాడు. అనారోగ్యం పాలవడంతో గ్రామస్తులు చేరదీశారు. వృద్ధుడికి ఆధార్, రేషన్ కార్డులు, పింఛన్ ఏమీ లేకపోవడంతో జీవనాధారం లేక మెళియాపుట్టి మండల కేంద్రంలో భిక్షాటన చేసుకుంటున్నాడు. రాత్రి సమయాల్లో షాపుల వరండాలో తలదాచుకుంటున్నాడు. వృద్ధుడి కోసం పట్టించుకునే నాథుడే కరువయ్యారు. కనీసం పింఛను అయినా ఈయనకు జీవనాధారం కలిగి ఉండేది. అందరి కళ్ల ఎదుటే వృద్ధుడి దయానియస్థితి చూస్తున్నారే తప్ప పట్టించుకునే వారే కరువయ్యారు. తనకు ఇప్పటికీ ఆధార్, రేషన్ కార్డు, పింఛను గాని ఏమీ లేవని ఆవేదన వ్యక్తం చేశాడు. ఇప్పటికైనా అధికారులు స్పందించి దయానియా పరిస్థితిపై దృష్టి సారించి ఆదుకోవాలని కోరుతున్నాడు.

లచ్చయ్య

సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి- పలాస

తమ సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరుతూ స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ఉద్యోగులు నిర్వహిస్తున్న ఆందోళన శుక్రవారంతో రెండో రోజుకు చేరుకుంది. నల్ల బ్యాడ్జీలు ధరించి పాల్గొన్నారు. ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని, కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలన్నారు. ఖాళీగా ఉన్న ఉద్యోగుల పోస్టులు భర్తీ చేయాలన్నారు. బకాయి పడిన ఏరియార్స్‌ను విడుదల చేయాలన్నారు. కారుణ్య నియామకాలను చేపట్టారు. కొత్త డివిజన్‌లో స్థాయి సిబ్బంది నియమించాలన్నారు. పెండింగ్ డిఎలను తక్షణమే చెల్లించాలన్నారు. కార్యక్రమంలో ఇఇ ప్రసాదరావు, డిఇఇ కృష్ణమూర్తి, ఎఎఇ భాస్కరావు, లైన్ ఇన్‌స్పెక్టర్లు గార రాజారావు, కొమ్మల గిరేశ్వరరావు, హిమగిరి, నీలాద్రి పాల్గొన్నారు.

ఆందోళన చేస్తున్న విద్యుత్‌శాఖ అధికారులు

చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న నాయకులు

చారుమజుందార్‌కు నివాళి

పలాస : మండలంలోని మామిడిపల్లిలో భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్-లెనినిస్ట్) వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ చారుమజుందార్ 51వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లర్పించారు. కార్యక్రమంలో సిపిఐఎంఎల్ లిబరేషన్ నాయకులు జడ్డే నేతాజీ, మద్దిల రాజారావు, సార పాపయ్య, పున్నయ్య, తవిటయ్య, రామయ్య, మామిడి జానికిరావు, దేవరాజులు పాల్గొన్నారు.

గండి పూడ్చివేత

మెళియాపుట్టి : మండలంలో గొడ్డ-ఆంపురం మధ్య అనంతగిరి సమీపంలో ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు గండి పడింది. దీంతో ప్రజలు, వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడ్డాడు. అధికారులకు మొరపెట్టుకున్నారు. ఎవరూ స్పందించకపోవడంతో శుక్రవారం సర్పంచ్ సిద్ధిపాలెం గౌరీస్ స్పందించారు. సొంత నిధులు వెచ్చించి ప్రొక్లెయినర్‌తో పనులు చేపట్టి గండిని పూడ్చారు. దీంతో యధావిధిగా రాకపోకలు సాగుతున్నాయి. గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు.

గండిని పూడ్చుతున్న గ్రామస్తులు

రమాకుమారి మృతదేహం

భార్యాభర్తల ఆత్మహత్యాయత్నం

భార్య మృతి, భర్త పరిస్థితి విషమం

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

మండలంలోని అయోధ్యపురం పంచాయతీ చిన్నరోకలపల్లిలో ఈ నెల 24న భార్యాభర్తలు గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. చికిత్స పొందుతూ భార్య శుక్రవారం మృతి చెందగా, భర్త పరిస్థితి విషమంగా ఉంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తామరపల్లి గిరి దుబాయ్‌లో పనిచేస్తూ... ఆరేళ్ల కిందట అదే పంచాయతీ దీపావళిపేటకు చెందిన రమాకుమారిని వివాహం చేసుకున్నాడు. వీరికి ఐదేళ్ల బాబు, మూడేళ్ల పాప ఉన్నారు. రెండేళ్ల క్రితం దుబాయ్ వెళ్లి ఇటీవల స్వగ్రామానికి వచ్చాడు. మరలా దుబాయ్ వెళ్తానని భార్యకు చెప్పారు. భార్య వద్దు... ఇక్కడే ఏదో ఒక పని చేసుకుని ఆనందంగా జీవిద్దామని సర్దిచెప్పింది. దీంతో గిరి మొండికేసి నాలుగు రోజులుగా భోజనం మానేశాడు. దీనిపై నాలుగు రోజుల పాటు ఇద్దరూ మదన పడుతూ ఈ నెల 24న ఘర్షణ పడ్డారు. నువ్వు భోజనం చేయకపోతే నేను ఆత్మహత్య చేసుకుంటానని పొలానికి తెచ్చిన గడ్డి మందును రమాకుమారి తాగేసింది. నువ్వు లేకపోతే నేనెందుకు అంటూ భర్త గిరి కూడా గడ్డి మందును తాగేశాడు. ఇద్దరూ అపస్మారకస్థితికి చేరుకోవడంతో కుటుంబ సభ్యులు విశాఖపట్నం కెజిహెచ్‌కు తరలించారు. నాలుగు రోజుల పాటు భార్యభర్తలిద్దరూ చికిత్స పొందారు. శుక్రవారం రమాకుమారి పరిస్థితి విషమించి మృతి చెందింది. భర్త చికిత్స పొందుతున్నాడు. మృతురాలి తల్లి దమయంతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఎల్.రామకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

మహిళ మృతదేహం లభ్యం

కోటబొమ్మాళి: మండలంలోని యలమంచలి పంచాయతీ పరిధిలో గురువెళ్లిపేట సమీపంలో రైల్వేలైన్‌కు వంద అడుగుల దూరంలో పంట కాలువలో గుర్తుతెలియని మహిళ మృతదేహం శుక్రవారం లభ్యమైంది. సుమారు 25-30 సంవత్సరాల మధ్య వయసు కలిగి, నలుపు టాప్, నలుపు లెగ్గిన్ ధరించి తెలుపు రంగు ఛాయ కలిగి ఉంది. ఈమె ఏదైనా రైలు నుంచి జారి పడిందా? ఎవరైనా హత్యచేసి పంట కాలువలో పడేసి ఉంటారా? అన్న అనుమానాలు సర్వాత్రా వ్యక్తం అవుతుంది. రైల్వే పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి స్వాధీనం చేసుకున్న పోలీసులు

33 కేజీల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలో గొప్పిలి కాలనీ చెరువు గట్టుపై 33 కేజీల బరువు ఉన్న 16 గంజాయి ప్యాకెట్లను స్వాధీనం పరుచుకున్నట్లు ఎస్ఐ టి.రాజేష్ శుక్రవారం తెలిపారు. గురువారం రాత్రి పోలీస్ గస్తీ నిర్వహిస్తున్నామని, వాహనం సైరన్ వేయడంతో గుర్తు తెలియని వ్యక్తులు భయపడి గంజాయిని విడిచిపెట్టి వెళ్లిపోయారని అన్నారు. విఆర్ఒ నరేష్ సమాచారం మేరకు వాటిని స్వాధీన పరుచుకున్నట్లు తెలిపారు.

పాముకాటుతో మహిళ మృతి

సోంపేట: పదేళ్ల క్రితం తన భర్త కేన్సర్ వ్యాధితో భాధపడుతూ మృతి చెండటంతో ఆ కుటుంబానికి అన్నితానై ఉంటున్న సోంపేట మండలం మామిడిపల్లి పంచాయతీ గణేష్ సెంటర్ వీధికి చెందిన దున్న తులసమ్మ (40) శుక్రవారం తెల్లవారు జామున పాము కాటుకు గురై మృతి చెందింది. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గోంగూర పంటను పండిస్తూ, ఆ పంటను పరిసర గ్రామాల్లో తిరుగుతూ విక్రయించి వచ్చిన డబ్బుతో కుటుంబ పోషణ చేస్తుండేది. రోజులానే శుక్రవారం తోటకు వెళ్లి గోంగూర పంటను కోస్తూ ఉండగా పాము కాటు వేసింది. దీనిని సక్రమంగా గమనించక, గోంగూర గంప పట్టుకొని అక్కపల్లిలో అమ్మేందుకు వెళ్లిపోయింది. రాత్రి ఏడు గంటలకు అక్కుపల్లి కూడలిలో కళ్లు తిరిగి పడిపోవడంతో స్థానికులు సమీపంలో ఉండే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించయారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉందని వైద్యులు చెప్పడంతో కుటుంబ సభ్యులు పలాసలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి జిల్లా సర్వసనాస్పత్రికి రిఫర్ చేశారు. మార్గంమధ్యలో పరిస్థితి విషమించి మృత్యువాత పడింది. అనంతరం సోంపేట ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. మృతురాలికి వందన, ఝాన్సీలు ఉన్నారు. తల్లి మృతితో అమ్మా మాకు దిక్కెవరు అంటూ రోదించిన తీరు అందరినీ కంటతడి పెట్టించింది. సర్పంచ్ పాతిని. శేషగిరి, ఎంపిటిసి దున్న మాధవరావు చిన్నారులను ఓదార్చారు.

'జగనన్న సురక్ష'తో సమస్యల పరిష్కారం

మెళియాపుట్టి : మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

ప్రజాశక్తి- జలుమూరు

ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి అమలు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమంతో సమస్యలు పరిష్కారం అవుతున్నాయని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. మండలంలోనిఅల్లాడ, సైరిగాంలలో శుక్రవారం నిర్వహించిన జగనన్న సురక్షలో పాల్గొని మాట్లాడారు. అర్హత గల వారందరికీ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందించేందుకే ఈ కార్యక్రమం అమలు చేశారన్నారు. కార్యక్రమంలో ఎంపిపి వాన గోపి, మండల కన్వీనర్ కనుసు సీతారాం, వైస్ ఎంపిపి తంగి మురళీకృష్ణ, మండల సలహాదారుడు పైడి విఠల్‌రావు, అల్లాడ, చల్లవానిపేట పిఎసిఎస్ అధ్యక్షులు మొజ్జాడ శ్యామలరావు, పాగోటి రాజప్పలనాయుడు, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షులు దామ మన్మథరావు, తహశీల్దార్ బి.సత్యం, ఎంపిడిఒ ఎల్.వి.అప్పారావు, ఎంఇఒ మాధవరావు పాల్గొన్నారు.

మెళియాపుట్టి : ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని పరిష్కరించేందుకు జగనన్న సురక్ష దోహదంపడుతుందని ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. మండలంలో చాపర, మెళియాపుట్టి గ్రామాల్లో నిర్వహించిన జగనన్న సురక్షలో పాల్గొని ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి గూడ ఎండయ్య, సర్పంచ్‌లు బోసి రామారావు, రేఖాన లక్ష్మమ్మ, తహశీల్దార్ పి.సరోజని, ఎంపిడిఒ పి.చంద్రకుమారి, ఎంఇఒ ఎస్.దేవేందరరావు, మండల ఎఒ దానకర్ణుడు, ఎపిఎం లలితకుమారి పాల్గొన్నారు.

నందిగాం : జగనన్న సురక్ష ద్వారా లబ్ధిదారులకు మేలు చేకూరుతుందని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని దిమ్మిడిజోలలో సర్పంచ్ ఎం.సంజీవరావు, వైస్ ఎంపిపి లక్ష్మీకాంతం అధ్యక్షతన నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిపి నడుపూరు శ్రీరామ్మూర్తి, పిఎసిఎస్ అధ్యక్షులు కురమాన బాలకృష్ణారావు, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు చిన్ని జోగారావు యాదవ్, జెసిఎస్ కన్వీనర్ జడ్యాడ జయరాం పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: మండలంలోని వాండ్రాడ సచివాలయం నిర్వహించిన జగనన్న సురక్షలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి దువ్వాడ వాణి, ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరావు, జెడ్‌పిటిసి దుబ్బ వెంకటరావు, ఇన్చుఆర్జి ఎంపిడిఒ రాజారావులు 11 రకాల ధ్రువపత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. సచివాలయ కన్వీనర్ వెలమల శాంతారావు, ఎంపిటిసి మెండ తాతయ్య, వ్యవసాయ కమిటీ సభ్యులు కవిటి రామరాజు పాల్గొన్నారు.

నియోజకవర్గ ప్రజలకు నీరందించాలి

కొత్తూరు : పాతపట్నం నియోజకవర్గ ప్రజలకు ముందు తాగునీరు అందించాలని మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ డిమాండ్ చేశారు. మండలంలోని మాతలలోని తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ఇటీవల హిరమండలం గొట్టాబ్యారేజీ వద్ద ఉద్దానం తాగునీటి ప్రాజెక్టు ట్రయల్ రన్‌లో పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజుతో ఎమ్మెల్యే రెడ్డి శాంతి పాల్గొన్నారని అన్నారు. పక్క నియోజకవర్గ వర్గాలకు నీరు అందించేందుకు ముందు పాతపట్నం, మెళియపుట్టి, హిరమండలం, కొత్తూరు, ఎల్ఎల్‌పేట మండలాల ప్రజలకు తాగునీరు అందించాలని డిమాండ్ చేశారు.

తిరుపతిరావును సన్మానిస్తున్న సర్పంచ్ లక్ష్మణరావు

ఆకట్టుకున్న గణిత దశావధానం

ప్రజాశక్తి- కవిటి

స్థానిక ఆర్ష విజ్ఞాన భారతి (బివికె) పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన గణిత దశావదానం ఆకట్టుకుంది. కవిటి, జగతి, శిలగాం బివికె పాఠశాలలు సముక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో గణిత దశావధాని మడ్డు తిరుపతిరావు చేసిన అవదానం ఆకట్టుకుంది. ఘన మూలాలు, సమస్య పూర్ణం, పంచమ మూలలు, మెమరీ గేమ్, గణితచదరం వంటి అంశాలపై అలవోకగా ఆయన చేసిన అవదానం అబ్బురపరిచింది. అనంతరం బివికె సంస్థల ఆధ్వర్యాన మడ్డు తిరుపతిరావు, ఎంఇఒ ధనుంజయ మజ్జిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ పూడి లక్ష్మణరావు, పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ పూడి రామారావు, ఢిల్లేశ్వరావు, గణేష్, అనిల్, ఆరంగి వెంకటరావు, బల్లెడ భారతి, బెందాళం రాంబాబు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేస్తున్న గోవిందరావు

పలువురికి ఆర్థికసాయం

ప్రజాశక్తి- పాతపట్నం

మండలంలోని తామర, తీమర గ్రామాలకు చెందిన గుర్రాల సిమ్మమ, అల్లు చిన్నమ్మ, బత్తిలి చిన్నమ్మి, పేయ్యల ఆదమ్మ, పి.సాయమ్మ, ఉమాపతి ఇటీవల మృతి చెందారు. ఆ కుటుంబాలకు, అలాగే తిర్లింగి చిన్నమ్మ అనారోగ్యంతో బాధపడుతుండడంతో ఆమెను శుక్రవారం టిడిపి నాయకులు, పారిశ్రామికవేత్త మామిడి గోవిందరావు పరామర్శించి ఆర్థికసాయం అందించారు. భవిష్యత్‌లో ఏ అవసరం వచ్చినా నేనున్నానని భరోసా ఇచ్చారు. అలాగే పడ్డాన సాయమ్మ అనారోగ్యం కారణంగా ఇటీవలే మరణించారు ఆ కుటుంబానికి ప్రగడ సానుభూతి తెలియజేశారు.

ఇచ్ఛాపురం : మండలంలోని సన్యాసిపుట్టుగకు చెందిన నీలాపు కేదారేశ్వరరావు కొంత కాలంగా కిడ్నీ వ్యాధితో ఇటీవల మృతి చెందారు. నిరుపేద కుటుంబం కావడంతో గ్రామస్థులంతా చేయిచేయి కలిపి రూ.1,12,000 నగదును వసూలు చేశారు. ఈ మొత్తాన్ని శుక్రవారం మృతుడి భార్యకు అందజేశారు.

మొక్కల పంపిణీ

జలుమూరు: మొక్కలతోనే మానవ మనుగడ సాధ్యమవుతుందని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ఎన్ఆర్ఇజిఎస్ ద్వారా లబ్ధిదారులకు మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించే బాధ్యతను తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపిపి వాన గోపి, మండల వైసిపి కన్వీనర్ కనుసు సీతారాం, వైస్ ఎంపిపి తంగి మురళీకృష్ణ, మండల సలహాదారుడు పైడి విఠల్‌రావు పాల్గొన్నారు.

'మహాశక్తి'తో మహిళా అభ్యున్నతికి కృషి

పోలాకి: మహాశక్తి పేరుతో మహిళా అభ్యున్నతికి టిడిపి కృషి చేస్తుందని మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. మండలంలోని తలసముద్రంలో మహాశక్తి చైతన్య రథాన్ని శుక్రవారం ప్రారంభించారు. అనంతరం మహానాడు వేదికగా మాజీ సిఎం నారా చంద్రబాబు నాయుడు మహిళలకు మహాశక్తి పేరుతో ఇస్తున్న పథకాలను, తల్లికి వందనం, అడ్డబిడ్డ నిధి, ఉచిత గ్యాస్ సిలిండర్లు, ఉచిత ఆర్‌టిసి ప్రయాణం మేనిఫోస్టోపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి మాజీ సభ్యులు సుగుణ, పార్లమెంట్ మహిళా కమిటీ సభ్యులు గురుగుబెల్లి ఝాన్సీ, బోర యశోద, లబ్బా ధనలక్ష్మి, మండల పార్టీ అధ్యక్షులు మిరియాపల్లి వెంకటప్పలనాయుడు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : మండలంలోని ఈదుపురంలో మహాశక్తి కార్యక్రమంలో టిడిపి మేనిఫోస్టో పోస్టర్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి మహిళా జిల్లా కార్యదర్శి ఆశిలీలారాణి, దక్కత ఢిల్లీరావు, సాడి సహదేవ్, బోర ప్రసాద్, లోపింటి పద్మనాభం, బోర యువరాజు, ఈశ్వర్, సిద్ధార్ధ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రమణమూర్తి

నిర్లక్ష్యంతో జీవితాలు నాశనం చేసుకోవద్దు

మాట్లాడుతున్న వెంకటేష్

ప్రజాశక్తి- కంచిలి

వాహనాలు నడిపేటప్పుడు చిన్నపాటి నిర్లక్ష్యాల వల్ల చాలామంది తమ జీవితాలను కోల్పోతున్నారని వైద్యుడు తుంగాన వెంకటేష్ అన్నారు. మండలంలోని శాసనంలో ఆల్ ఇండియా స్టూడెంట్ ఫెడరేషన్ కార్యదర్శి అయినింటి లోకనాథ అధ్యక్షతన రోడ్డు ప్రమాదాల నివారణపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఇటీవల గ్రామానికి చెందిన నెయ్యల గణేష్ అనే విద్యార్థి హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనం నడుపుతూ ప్రమాదానికి గురై మృతి చెందిన నేపథ్యంలో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. వాహనాలు నడిపేటప్పుడు చిన్న చిన్న నిర్లక్ష్యాల వల్ల చాలామంది ప్రాణాలు కోల్పోయి కుటుంబాలను చీకటిలో నింపుతున్నారన్నారు. ప్రతిఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించి క్షేమంగా గమ్యస్థానాలు చేరాలని కోరారు. మైనర్లకు వాహనాలు ఇవ్వకుండా తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గుడ్డిభద్ర వేణు, గ్రామ పెద్దలు రామారావు పాల్గొన్నారు.

శిక్షణ ఇస్తున్న రాములు

కేకుల తయారీపై శిక్షణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రోటరీ క్లబ్, మెప్మా, కాన్ఫెడరేషన్ అఫ్ విమెన్ ఎంట్రర్‌పెన్యూర్స్ ఆఫ్ ఇండియా, హాయ్ బేకరీ చెఫ్ సంయుక్తంగా బిస్కెట్లు, కేకుల తయారీలో మహిళలకు శుక్రవారం శిక్షణ ఇచ్చారు. నగరంలోని ప్రయివేటు హోటల్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా మెప్మా పీడీ ఎం.కిరణ్‌కుమార్ ఈ శిక్షణను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమతుల్యమైన పౌష్టికాహారం తీసుకుంటే మన ఆరోగ్యం పెంపొందుతుందని అన్నారు. రోగ నిరోధక శక్తి పెరిగి శక్తివంతమైన జీవనశైలికి దోహదపడుతుందని అన్నారు. కొర్రలు, సామలు, జొన్నలు, బెల్లంతో కేక్ తయారీలో శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో గీతాశ్రీకాంత్, మహిళా సమాఖ్య కో-ఆర్డినేటర్స్ విజయలక్ష్మి, సుగుణారెడ్డి, కోవె ఇండియా రాష్ట్ర అధ్యక్షులు రాధిక, జాతీయ కార్యదర్శి అపర్ణ పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ఏర్పడిన గొయ్యి

పొంచి ఉన్న ప్రమాదం

లావేరు : మండలంలో వాయుగుండం ప్రభావంతో కురిసిన వర్షాలకు పెదరవుపల్లి పంచాయతీ అరంగిపేట సమీపంలో రోడ్డు వరదకు గండి పడి పెద్ద గొయ్యిగా ఏర్పడింది. దీంతో ప్రజలు, బైక్‌లు, ఆటో ఈ రోడ్డుపై ప్రయాణం చేయాలంటే భయపడుతున్నారు. నిరంతరం రద్దీగా ఈ రోడ్డుపై గొయ్యి ఏర్పడడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ప్రమాదం పొంచి ఉండడంతో సంబంధిత అధికారులు వెంటనే స్పందించి మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా ఓటరు సర్వే

ప్రజాశక్తి- పలాస

కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాలు మేరకు బూత్ లెవెల్ ఆఫీసర్‌తో బూత్ ఏజెంట్స్ తప్ప మీగతావరు వెళ్లడానికి లేదని, కానీ, వైసిపి నాయకులు ఎన్నికల ప్రచారం తలపించేలా బూత్ లెవెల్ ఆఫీసర్‌తో ఓటరు సర్వేకు వెళ్తున్నారని పట్టణ అధ్యక్షులు నాగరాజు, టిడిపి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి విఠల్‌రావు అన్నారు. ఈ మేరకు ఆర్‌డిఒ సీతారామ్మూర్తిని కలిసి శుక్రవారం వినతిపత్రం అందజేశారు.. నిబంధనలకు విరుద్ధమని తెలిసినా అధికారులు అభ్యంతరం చెప్పకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తుందన్నారు. మున్సిపాలిటిలో ఓటరు సర్వే నత్తనడకన సాగుతుందన్నారు. కార్యక్రమంలో వజ్రపుకొత్తూరు టిడిపి అధ్యక్షుడు మోహనరావు పాల్గొన్నారు.

ప్రకృతి సాగులో పండించిన బెల్లం భేష్

ఆమదాలవలస : ప్రకృతి సాగులో పండించిన బెల్లం అధిక పోషకాలు కలిగి ఉంటుందని మార్కెటింగ్ నేషనల్ ఫార్మింగ్ అసోసియేట్ భాను అన్నారు. మండలంలోని నిమ్మతొర్లాడలో రాష్ట్ర ప్రకృతి వ్యవసాయ విభాగం నుంచి వచ్చిన భాను ప్రకృతి వ్యవసాయంలో తయారు చేసిన బెల్లాన్ని శుక్రవారం పరిశీలించారు. గ్రామంలో ప్రకృతి సాగులో పండిస్తున్న బెల్లం రైతుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు ప్రకృతి సేద్యంలో పండించిన ఉత్పత్తులకు మంచి ఆదరణ ఉందని, ఎవరిపైనా ఆధారపడకుండా సొంతంగా మార్కెటింగ్ చేసుకోవడానికి చాలా వేసులుబాటు ఉందని తెలిపారు. అలాగే లైన్ షోయింగ్ పద్ధతిలో వేస్తున్న వరి పంటను సందర్శించి పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ సిబ్బంది శివాజీ, శోభన్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది చిరంజీవి, తిరుపతిరావు, లక్ష్మి, కృష్ణవేణి, జానకిరామ్ పాల్గొన్నారు.

బెల్లాన్ని పరిశీలిస్తున్న భాను

ప్రముఖుల జీవిత చరిత్రలు చదవాలి

పొందూరు: ప్రముఖుల జీవిత చరిత్రలను చదవడంతో పాటు విద్యార్థులు ఉద్వేగాలను నియంత్రించుకుంటూ భవిష్యత్‌కు మంచిబాట వేసుకోవాలని మానసిక విషయ నిపుణులు బొడ్డేపల్లి భూపతిరావు పేర్కొన్నారు. స్థానిక మానసవేణి హైస్కూల్‌లో శుక్రవారం స్పందన ఫౌండేషన్‌కు 'నేను సైతం' కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థానాలకు ఎదగాలంటే ఉన్నతమైన వ్యక్తుల జీవిత చరిత్రలు చదివి ప్రేరణ పొందాలన్నారు. లక్ష్యం స్పష్టంగా ఉండాలని, గమ్యం చేరేవరకూ అలుపెరగని కృషి ఇష్టంగా సాగించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ ఎంఆర్ఆర్‌సిహెచ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.